







ఏమిటిది స్వామీ!

భక్తుల ప్రాణాలు తీసిన ఆశ... ఆత్రుత

- ఆరుగురి దుర్మరణం
- మృతుల్లో ఐదుగురు మహిళలు
- స్విమ్స్, రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- రుయాలో నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ప్రాణాలు తీసిన బైరాగిపట్టెడ కేంద్రం



ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యే ఆరణి, కమిషనరు మౌర్య



సంఘటనాస్థలం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు



రుయాస్పత్రి వద్ద టీటీడీ అదనపు ఈవో



వైకుంఠ ద్వార దర్శనంతో పుణ్యం దక్కుతుందనే ఆశ వారి ప్రాణాలు తీసింది. టీటీడీ చరిత్రలో ఎన్నడూ జరగని ఘోర సంఘటనకు దారి తీసింది. తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రం ఆరుగురి పాలిట మృత్యు ప్రాంగణమైంది. వీరిలో ఐదుగురు మహిళలు. మధ్యాహ్నానికే తిరుపతిలోని ఎనిమిది టోకెన్ల జారీ కేంద్రాల వద్దకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ ఏపీ, తెలంగాణలలోని అనేక ప్రాంతాల నుంచీ అసంఖ్యాకంగా భక్తులు తరలివచ్చారు. నీళ్ళు, తిండి అని కూడా చూసుకోకుండా కేంద్రాల బయట ఎదురుచూశారు. గురువారం తెల్లవారుజామున ఐదింటికి టోకెన్ల జారీ అని ప్రకటించిన టీటీడీ రద్దీ పరిస్థితిని చూసి అర్ధరాత్రి పన్నెండింటి నుంచే టోకెన్లు జారీ చేయాలని భావించింది. తొమ్మిదింటి నుంచీ క్యూలైన్లలోకి భక్తులను అనుమతించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడానికి పోటెత్తారు. బైరాగిపట్టెడ కేంద్రం పక్కనే పార్కులో వేచివున్న భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడానికి గేటు వద్దకు తోసుకువచ్చారు. రాత్రి 8.50 గంటల సమయంలో మూసివున్న గేటును భక్తులు నెట్టుకుంటూ రావడంతో గేటు ఒక్కసారిగా తెరుచుకోవడంతో నియంత్రణ కోల్పోయారు. దీంతో తొక్కిసలాట జరిగింది. ఒకరినొకరు తొక్కుకుంటూ క్యూలైన్ల వైపు పరుగులు తీశారు. కిందపడిపోయిన భక్తుల ఆర్తనాదాలు, హాహాకారాలతో బైరాగిపట్టెడ హోరెత్తిపోయింది. ఈ కేంద్రం వద్ద భద్రతకు నియమించిన పోలీసు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఉప్పెనలా దూసుకొచ్చిన భక్తులను అదుపు చేయలేకపోయారు. తోపులాటలో ఊపిరాడక అనేక మంది మహిళలు అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఫోన్లు చేసి అంబులెన్సులు వచ్చేలోగా పోలీసు సిబ్బంది, స్థానికులు పడిపోయిన భక్తులకు సపర్యలు చేసే ప్రయత్నం చేశారు. కొందరికి సీపీఆర్ కూడా చేశారు. సరైన శిక్షణ లేకుండా సీపీఆర్ చేస్తున్న దృశ్యాల వీడియోలు వైరల్ అయ్యాయి. గాయపడినవారిని రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ మొదలు పెట్టే సమయానికే జరగరాని ఘోరం జరిగిపోయింది. ఆ తర్వాత యధా ప్రకారం బైరాగి పట్టెడ కేంద్రంలో కూడా టోకెన్ల జారీ కొనసాగింది. అర్ధరాత్రి 12 గంటల సమయానికి వైకుంఠ ఏకాదశి రోజుకు సంబంధించిన 38 వేల టోకెన్ల జారీ పూర్తయింది. 12.30 గంటల సమయానికి వైకుంఠ ద్వాదశికి సంబంధించిన టోకెన్లలో 4500టోకెన్లు పంపిణీ చేశారు. తిరుపతిలో జరిగిన ప్రమాద ఘటనపై సీఎస్ విజయానంద్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ నివేదిక పంపినట్లు తెలిసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

భక్తులు పెద్ద ఎత్తున రావడంతోనే..

వైకుంఠ ద్వార దర్శనానికి గురువారం ఉదయం 5గంటలకు జారీచేసే టోకన్ల కోసం భక్తులు పెద్ద ఎత్తున ఎగబడడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటన దురదృష్టకరం. మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. ఘటనకు సంబంధించి వివరాలను ఎస్పీ ద్వారా తెలుసుకున్నా. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులను పరామర్శించా, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించా.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి







స్విమ్స్ వద్ద...



రుయాస్పత్రిలో...

చికిత్స పొందుతున్న 34మంది

ఈ ఘటనలో మొత్తం 40 మంది గాయపడినట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వీరిలో రుయాస్పత్రికి 28మందిని తరలించగా నలుగురు మృతి చెందారని, స్విమ్స్‌కు 12 మంది తరలించగా ఇద్దరు మృతి చెందినట్టు చెప్పారు. బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. మృతిచెందిన ఆరుగురులో ఐదుమంది మహిళలు ఉండగా ఒకరు మాత్రమే పురుషుడు అని చెప్పారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

రుయా, స్విమ్స్‌కు క్యూ కట్టిన అంబులెన్సులు

మృత్యువాత పడడంతో పాటు 20 మందికి పైగా అస్వస్థత, గాయాల పాలయ్యారు. చికిత్స నిమిత్తం ఎస్వీఆర్ రుయా, స్విమ్స్ ఆస్పత్రికి తరలించడంతో ఆస్పత్రిలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఒకదాని వెంట మరొకటి అంబులెన్స్‌లు ఆస్పత్రుల వద్దకు క్యూ కట్టడంతో భక్తుల బంధువులు, ఆస్పత్రి సిబ్బంది, మీడియా ప్రతినిధులు అంబులెన్స్ వైపు పరుగులు తీశారు. కాళ్లు విరిగి గాయపడ్డ భక్తుల ఆర్తనాదాలు కలిచివేశాయి. చికిత్సపొందుతున్నవారిని టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్‌లతో పాటు పోలీసు అధికారులు పరామర్శించి, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారులను కోరారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో పాటు ఇతర రాజకీయ పార్టీ నాయకులు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మునిరెడ్డి (35), ఈశ్వరమ్మ (36), పార్వతి (52), ఎం.రజిని (40), నాగరాజు (46), శోభారాణి (37), సుబ్బాచారి (63), అంబలాష్ (40), సాంబశివ (69), సావిత్రమ్మ (65), లక్ష్మీదేవి (30), కళావతి (34), అప్పల కొండ (55), నరేంద్ర (40), జయభారతి (47), షాముల్ రాజు (45), ఆదిలక్ష్మి (62), సూర్యకమల (45), రాజేశ్వరి (52), ఎం.రత్నమ్మ (50), నూకారత్నమ్మ (50), మల్లయ్య (42), పెద్దిరాజు (52), రమణమ్మ (48), శ్రీరామప్ప (70), సునీత (44), గౌరి (40), విజయలక్ష్మి (40), క్రిష్ణమ్మ (60), సూర్య (37), రమాదేవి (52). వీరిలో నలుగురు పాలిట్రామాతో చికిత్స పొందుతున్నారు. వీళ్ల పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉంది. ప్రాణాపాయం లేదని వైద్యులు అంటున్నారు. రాత్రి రుయా వద్దకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చేరుకుని బాధితులతో మాట్లాడారు. కాగా, 1.25 గంటలకు బాధితులు, వారి బంధువులకు ఆస్పత్రుల వద్దకు టీటీడీ అన్నప్రసాదాలు పంపింది.





క్యూలైన్ వద్ద పిల్లల నిరీక్షణ... సంఘటన తర్వాత టోకెన్లు జారీ చేస్తున్న టీటీడీ సిబ్బంది

అంచనా వేయడంలో అధికారుల విఫలం

తిరుపతిలో ఏర్పాటుచేసిన కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలుకోల్పోవడం బాధాకరం. టోకెన్‌ల జారీచేసే ముందు రోజు నుంచే భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడం, అంచనా వేయడంలో అధికారులు విఫలం చెందడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది. ఏర్పాట్లు బాగా చేసినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబాలకు బీజేపీ తీవ్ర సంతాపం ప్రకటిస్తోంది.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ అధికార ప్రతినిధి



చిల్లకూరు, తడ పోలీసులచే

వంద కిలోల గంజాయి పట్టివేత

- మాజీ హోంగార్డుతో పాటు ఆరుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- మూడు కార్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు చోట్ల 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.25 లక్షలు ఉంటుందని అంచనా. చిల్లకూరు పోలీసులు 72 కిలోలు, నలుగురు నిందితులను.. తడ పోలీసులు 28 కిలోల గంజాయి, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం..



సీజ్ చేసిన 100 కిలోల గంజాయిని మీడియాకు చూపుతున్న ఎస్పీ

- పుత్తూరుకు చెందిన మాజీ హోంగార్డు పసుపులేటి గిరిబాబు, తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన మదన్‌కుమార్, గుమ్మిడిపూడికి చెందిన పంజనాధన్, మునసుందరం కొంతకాలంగా కాకినాడ జిల్లా తుని నుంచి గంజాయి తీసుకొచ్చి పుత్తూరు, తమిళనాడు ప్రాంతాల్లో విక్రయించేవారు. గతంలో గిరిబాబుపై కేసు నమోదైంది. తాజాగా వీరు తుని నుంచి కారులో దాదాపు 72 కిలోల గంజాయి తీసుకొస్తున్నారనే ముందస్తు సమాచారం అందింది. దీంతో గూడూరు డీఎస్పీ రమణకుమార్, అతడి బృందం మంగళవారం రాత్రి చిల్లకూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కడివేడు గ్రామం, కోట క్రాస్ రోడ్డు వద్ద వేచి ఉన్నారు. అతివేగంగా ముందు పైలట్ చేస్తున్న మాజీ హోంగార్డు గిరిబాబు కారు వస్తుండగా వెనుక గంజాయి తీసుకొస్తున్న మరో కారు పోలీసులను చూసి తప్పించుకుని పోవడానికి ప్రయత్నించారు. కారులో వెళ్లిపోతుండగా పోలీసులు చేజ్ చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో పోలీసు కారును సైతం ఢీకొట్టే ప్రయత్నం చేశారు. చివరకు రెండు కార్లు, దాదాపు 72 కిలోల గంజాయి స్వాధీనం పోలీసులు చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మళ్లీ వారిని కస్టడీకి తీసుకుని విచారించనున్నట్లు ఎస్పీ చెప్పారు.

తడ పరిధిలో...

తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూడికి చెందిన కె.షారూఖాన్, అదే ప్రాంతం సామిరెడ్డి కండ్రిగకు చెందిన జి. అరుళ్ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడేవారు. ఈ క్రమంలో ముందుగా అందిన సమాచారం మేరకు తడ సర్కిల్ పరిధిలోని శ్రీసిటీ వద్ద పోలీసులు కాపుకాచారు. వీరు కారులో చెన్నైకు గంజాయి తరలించడానికి వస్తుండగా చేజ్ చేసి పట్టుకున్నారు. వీరి నుంచి 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, షారూఖాన్, అరుళ్‌ను అరెస్టు చేశారు.

శెహభాష్ డీఎస్పీ, సీఐలు

ఆరుగురు గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. గూడూరు డీఎస్పీ రమణకుమార్, సీఐ కిషోర్‌బాబు, చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బందిని.. తడ ఘటనలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్పనాయుడు, సిబ్బంది ఉన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బాలలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ పద్మజారెడ్డి

పాకాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాలలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలతో తలెత్తే అనర్థాలు, కౌమారదశ, రక్తహీనత, రుతక్రమ పరిశుభ్రత తదితర అంశాలపై సంక్షేమ, మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఏఎన్ఎం, వెలుగు అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో బాబ్జీ, ఈవోపీఆర్డీ శశిరేఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.కిరణ్మయి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులే టీటీడీకి బ్రాండ్ అంబాసిడర్లు

భక్తులకు నిబద్ధతతో సేవలందించాలి: టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీటీడీకి ఉద్యోగులే బ్రాండ్ అంబాసిడర్లని టీటీడీ ఈవో శ్యామలరావు అభివర్ణించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. తిరుమల ఆస్థానమండపంలో బుధవారం సాయంత్రం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్నారు. ఈవో మాట్లాడుతూ.. టీటీడీలో సమిష్టిగా పనిచేసే పటిష్ఠమైన యంత్రాంగం ఉందన్నారు. శ్రీవారి, పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా విజయవంతం చేశారన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించేందుకు మరింతగా మన్ననలు పొందేలా పనిచేయాలన్నారు. అంతకుముందు వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. మన దేశంతో పాటు విదేశాల్లోని భక్తులు వారి సంప్రదాయాలకు అనుగుణంగా సేవలు అందించడం ప్రతి రోజూ సవాల్‌తో కూడిన అంశమన్నారు. ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించాలని, మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, యాత్రికులకు పార్కింగ్ స్థలాలు, వేచిఉంటే పాయింట్లలో మార్గనిర్దేశం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ, సీవీఆర్వో రవి, అన్నప్రసాదం అధికారులు, విజిలెన్స్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీ-సర్వేతో రైతులకు ప్రయోజనం



భాకరాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

భాకరాపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూముల రీ-సర్వేతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని చిన్నగొట్టిగల్లు తహసీల్దారు జనార్దన్ రాజు తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో రీ-సర్వేపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలంలో రీ-సర్వే కోసం భాకరాపేట రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. రీ-సర్వే పనులు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. భాకరాపేట గ్రామంలో ఉన్న 1768.56 ఎకరాలలో ప్రతి సర్వే నెంబరును సబ్-డివిజన్ చేసి గ్రామసభలో సర్వే వివరాలు తెలియజేసి, అభ్యంతరాలు లేకపోతే కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రీ-సర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, డీటీ వాసుదేవ కుమార్, ఆర్ఐ జానకీరామ్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్లు గణేశ్, కేశవులు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై ర్యాలీ



రామచంద్రాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సొరకాయల పాళెం గ్రామంలో రెవెన్యూ అధికారులు భూరీసర్వేపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు వెంకటరమణ మాట్లాడుతూ సొరకాయలపాళెం గ్రామంలో జనవరి 20 నుంచి భూ రీసర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భూ సరిహద్దులను నిర్ధారించి అందులో ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయో గుర్తిస్తామన్నారు. అనంతరం రైతులకు సంబంధించి పట్టా భూములను సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దారు అమృత, ఆర్ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్లు రమేష్‌బాబు, మణి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వ్యక్తిగత నైపుణ్యం పెంచండి

తిరుచానూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పాఠశాల దశ నుంచే ప్రతి విద్యార్థిలో వ్యక్తిగత నైపుణ్యత పెంపొందించాలని ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ సురేష్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈఎండీపీ(వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం)లో భాగంగా నేటి విద్యార్థులు-భవిష్యత్తు పారిశ్రామికవేత్తలు అనే అంశంపై జిల్లాలోని 40 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భావితర పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి వారిలో వ్యక్తిగత నైపుణ్యత పెంచాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించి, సమస్యలను తామే పరిష్కరించుకునే విధంగా సామర్థ్యాన్ని పెంచాలన్నారు. మాస్టర్ ట్రైనర్స్ భానుప్రసాద్, మల్లీశ్వరి ఉపాధ్యాయులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈఎండీపీ జిల్లా మేనేజరు అనిత, శ్రీధర్ పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసంతోనే సమాజాభివృద్ధి


మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి

ఎర్రావారిపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి); కిశోర బాలికల వికాసంతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని తహసీల్దార్ పరమేశ్వర స్వామి అన్నారు. ఎర్రావారిపాలెం మండలంలోని శ్రీశక్తి కార్యాలయంలో యుక్తవయస్సు బాలికల వికాసం అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాలబాలికలు ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే యుక్తవయస్సు ఆరంభంలోనే అవగాహన కల్గించాలన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈవోఆర్డీ మాలతి, ఏసీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజరులు భారతి, సుహాసిని పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలి


కాంగ్రెస్ నేతల నిరసన

చంద్రగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అమిత్‌షాను మంత్రి మండలి నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి చంద్రగిరిలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా పార్లమెంటులో మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించాల్సి బీజేపీ ఆయనకు వత్తాసు పలకడం హేయమైన చర్య అన్నారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించక పోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఐరాల లోకేష్‌రెడ్డి, నాయకులు కలెందర్, ఉమేష్, శివశంకర్, బాలాజీ, పరదేశి,ఉసాధా, హేమంత్‌రెడ్డి, అక్బర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్వీయూ స్థాయిలో ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



చంద్రగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు, తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ స్థాయిలో మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. జూన్ 2024లో జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో బీకామ్(కంప్యూటర్స్), బీసీఏ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబరిచారు. బీకామ్(కంప్యూటర్స్)లో గోము పవన్‌కుమార్ 9.08 శాతం, దుద్యాల దివ్య 8.83 శాతం, దేవరింటి నమిత 8.58 శాతం మార్కులు సాధించారు. బీసీఏ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లో మాల్యా జోత్స్నబాయ్ 8.40 శాతం, ఎస్.ఆయేషా 8.09 శాతం, బ్రహ్మనపల్లి యశ్వసిని 7.88 శాతం మార్కులు సాధించారు. మొత్తం 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈసందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.

చంద్రగిరి

సరదాగా ఈతకెళ్లి యువకుడి మృతి


విజయ్ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనపాకం పంచాయతీ, అరిగిలవారిపల్లె సమీపంలోని కోమటివాని చెరువులో ఓ యువకుడు ఈతకెళ్లి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పనపాకం హరిజనవాడకు చెందిన గంగులయ్య కుమారుడు కత్తి విజయ్(30) గ్రామంలోని పిల్లలతో కలిసి సమీపంలోని కోమటివాని చెరువుకు వెళ్లాడు. వారితో కలిసి చెరువులో దూకాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. స్నేహితులు పరుగులు తీసి గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు చెరువులో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని గాలించగా సాయంత్రం 4 గంటల సమయంలో విజయ్ మృతదేహం కనిపించింది. విషయం తెలిసి మృతుడి భార్య శాలిని, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు తీస్తున్న పొగమంచు

రాత్రిపూట ప్రయాణాలు ప్రమాదకరం ● వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి


చంద్రగిరి జాతీయ రహదారిలో కమ్ముకొన్న పొగమంచు

చంద్రగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పొగ మంచు ప్రయాణికులపై పగబట్టింది. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు తీస్తోంది. ఇటీవల జరిగిన వరుస ఘటనలే అందుకు నిదర్శనం. తీవ్రమైన చలి, పొగ మంచు రోడ్లను కమ్ముకుంటోంది. ఉదయం ఏడు, ఎనిమిది గంటలపైనా మంచు వీడడం లేదు. ఇక రాత్రిపూట విపరీతమైన మంచు కారణంగా రహదారులు సక్రమంగా కనపడక వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. లైటింగ్ సరిగా అర్థం కాక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దారి కనపడక పోవడంతో పాటు మితిమీరిన వేగంతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

కొన్ని ఘటనలు..

గత నెల మండలంలోని ముంగిలిపట్టు వద్ద పొగమంచు కారణంగా అర్ధరాత్రి లారీ బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నరసింగాపురం వద్ద నారాయణ కళాశాల సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు శ్రీవారి భక్తులు మృతిచెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా తిరుమలకు పాదయాత్రగా వెళ్లే క్రమంలో 108 ఢీకొని ప్రమాదం బారినపడ్డారు. మంచు కారణంగా రోడ్డుపై నడిచి వెళ్తున్న భక్తబృందాన్ని గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇక చిన్నచిన్న ప్రమాదాలు అనేకం జరిగాయి. సాధ్యమైనంత వరు రాత్రిపూట ప్రయాణాలు మానుకుంటే మంచిదని పలువురు సూచిస్తున్నారు.

రాత్రిపూట ప్రయాణాలు ప్రమాదకరం



మంచు విపరీతంగా ఉన్నందున వాహనదారులు రాత్రి వేళ్ళల్లో ప్రయాలు రద్దు చేసుకోవడం మంచిది. అత్యవసర ప్రయాణాలు చేయాల్సి వస్తే వాహనాలు వేగం తగ్గించి సాగాలి. డ్రైవర్లు అద్దాలను తుడుచుకుంటూ నిద్ర మత్తులో జారకుండా టీ, కాఫీలు తాగడం మంచిది. అలా చేస్తే చాలావరకు నిద్రమత్తు దరిచేరదు. ఇక శ్రీవారిభక్తులు రాత్రి పూట పాదయాత్రను వాయిదా వేసుకుని, పగటి పూట చేయడం సురక్షితం.

\- సుబ్బరామిరెడ్డి, సీఐ, చంద్రగిరి.

శాస్త్రాల సమ్మేళనం మహాభారతం


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

పాకాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాభారతం వివిధ శాస్త్రాల సమ్మేళనమని ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ఆచార్య వీసీ వెంకటేశ్వరులు అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం, పలు సాహితీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మహాభారతం శాస్త్ర విజ్ఞానం జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ధర్మ, న్యాయ, రాజనీతి, పరిపాలనా, ఖగోళ, ఆయుర్వేద శాస్త్రాలకు మహాభారతం నిలయమన్నారు. ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మహాభారతంలోని శాంతిపర్వం అనేక ధర్మాలకు నిలయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా మాట్లాడుతూ మహాభారతాన్ని నేటి యువత అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ వాణిశ్రీ మహాభారతంలోని శ్రీకృష్ణుడు, కుంతీ, గాంధారీ, దౌపది పాత్రల విశిష్టతను వివరించారు. మహాభారతం భారతీయుల జీవనాడి అని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ అన్నారు. సదస్సు సంచాలకులు డాక్టర్ ఈశ్వరబాబు సదస్సు ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు. సదస్సు పత్రాలు ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాఘవరెడ్డి, వాసు, నరసిహులు, శ్రీనివాసులురెడ్డి, రమ్యజ్యోతి, రాజేష్, చెన్నకేశవులు, దివ్య, మునిరత్నం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

యువత సమాజానికి దిక్సూచిగా నిలవాలి


ఇంఫాక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యువత సమాజానికి దిక్సూచిగా నిలవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. డాలర్స్ గ్రూప్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా మహతి కళా క్షేత్రంలో నిర్వహిస్తున్న ఇంఫాక్ట్ కార్యక్రమం బుధవారం ముగిసింది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. యువతవ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. సంకల్ప బలం ఉంటే అనుకున్న లక్ష్యాలను సులభతరంగానే సాధించవచ్చన్నారు. విద్యార్థుల ఉన్నతి కోసం డాలర్స్ దివాకర్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కష్టపడి ఉన్నత కలలతో చదివించే తల్లిదండ్రుల కలల్ని నెరవేర్చాలని కోరారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. అయితే, నేటి ఆధునిక సమాజంలో సోషియల్ మీడియా, డ్రగ్స్, రీల్స్ వంటి వ్యసనాలకు యువత లోను కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వీటి వల్ల యువత మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటూ ఉందన్నారు. యువత జాగరూకతతో ఉండాలని సూచించారు. లేకపోతే ఎంతో విలువైన జీవితం నాశనమవుతుందని స్పష్టం చేశారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీపాదం మాట్లాడుతూ.. యువత భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం అతిథులను డాలర్స్ దివాకర్‌రెడ్డి శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో సత్కరించారు. రెండు రోజుల ఇంఫాక్ట్ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన యువత వేలాది మంది హాజరయ్యారు.

ఎంబీయూలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



కోలాటం ఆడుతున్న మోహన్‌బాబు - టగ్ ఆఫ్ వార్‌లో విద్యార్థినులు

చంద్రగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేయడం, ధాన్యపు గింజలతో పొంగలి తయారు చేయడం, కోలాటాలు, కర్రసాము, గొబ్బెమ్మ పాటలు, టగ్ ఆఫ్ వార్, బిల్లా కోడి, కబడ్డీ, ఖోఖో వంటి గ్రామీణ క్రీడలతో సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోగి మంటలు వేసి, కోలాటాలు ఆడుతూ, ఉట్టి లాగుతూ ఉల్లాసంగా గడిపారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను తెలిపే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. ఆరుకాలం పండించిన పంట ఇంటికి వచ్చే సమయంలో రైతన్న ఎంతో సంతోషంగా ఈ పండుగ జరుపుకుంటారని తెలిపారు. తెలుగు పండుగను విద్యార్థులతో కలిసి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

బడ్జెట్‌కు మించి కన్నప్ప సినిమా చిత్రీకరణ..

తన తనయుడు మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న కన్నప్ప సినిమా విశేషాలను మోహన్‌బాబు మీడియాకు తెలిపారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను న్యూజిలాండ్‌లో రెండుసార్లు చిత్రీకరించినట్లు తెలిపారు. అనుకున్న దానికన్నా ఎక్కువ బడ్జెట్ అయిందన్నారు. ఎక్కడా రాజీలేకుండా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 24న విడుదల చేయనున్నట్లు తెలిపారు.

కల్యాణ వెంకన్న ఆలయం ముస్తాబు

రేపు ఉదయం 5.30 నుంచి వైకుంఠ ద్వార ప్రవేశం





చంద్రగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంవైకుంఠ ఏకాదశి, ద్వాదశికి ముస్తాబైంది. తిరుమల తరహాలో ఈ ఆలయంలో వైకుంఠ ద్వార ప్రవేశం ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాద కౌంటర్లు, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని, వైకుంఠ ద్వారాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. శుక్రవారం, శనివారం రెండు రోజులు ప్రతి ఒక్కరికీ స్వామివారి దర్శనం భాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేసేందుకు టీటీడీ చర్యలు తీసుకుంటోంది. ప్రత్యేక దర్శనం రూ.100, రూ.20 ధర నిర్ణయించారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం కానుంది. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, ఇజనీరింగ్, విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సీఎంను కలిసిన హేమాంబరధరరావు



చంద్రగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కుప్పం పర్యటనలో ఉన్న సీఎంను కలిసి నియోజకవర్గ విషయాలను వివరించినట్లు చెప్పారు.

వైకుంఠ ఏకాదశితో విమానాశ్రయానికి వీఐపీల తాకిడి

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుపతి విమానాశ్రయానికి వీఐపీల తాకిడి అధికమైంది. తిరుమలలో పదిరోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రులతో పాటు వీఐపీల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు సవిత, సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, 20 సూత్రాల ప్రోగ్రాం చైర్‌పర్సన్ లంకా దినకర్, తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్‌లు శ్రీవారి దర్శనానికి రానున్నట్లు సమాచార శాఖ అధికారులు తెలిపారు.

వణికిస్తున్న జ్వరాలు

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు


ప్రభుత్వాస్పత్రిలో జ్వర బాధితులు

సూళ్లూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో పడమటి పల్లెలు విషజ్వరాలతో మంచం పడుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు విజృంభిస్తుండంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. మండలంలోని దామానెల్లూరు, మంగళంపాడు, మంగానెల్లూరు, సుగ్గుపల్లి, ఉగ్గుముడి, ఎన్‌వీకండ్రిగ గ్రామాల్లో ఇంటింటా జ్వరపీడితులు ఉన్నారు. ఉన్నట్టుండి కాళ్లు, చేతులు పట్టేయడం, తీవ్ర జ్వరం రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. జ్వరపీడితుల్లో చిన్నపిల్లలు అధికంగా ఉండటం గమనార్హం. దామానెల్లూరు, మంగానెల్లూరు గ్రామాల్లో ఊరంతా జ్వరాలతో బాధపడుతున్నారు. గత మూడు రోజుల నుంచి ఈ గ్రామాల్లో పిల్లలు కూడా తీవ్ర జలుబు, దగ్గు, జ్వరంతో ప్రభుత్వాస్పత్రికి వెళుతున్నారు. గత మూడు రోజులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. సోమవారం ఓపీ 310, మంగళవారం 360, బుధవారం 255 నమోదవగా ఇందులో 80 శాతానికి పైగా జ్వర బాధితులు ఉన్నారు. బుధవారం మంగానెల్లూరు, దామానెల్లూరు నుంచి దాదాపు 30 మందికి పైగా చిన్న పిల్లలు వైద్యం కోసం వచ్చారు. ఆస్పత్రిలో బెడ్‌లు సరిపోకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురికి వైద్యం చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

పూర్వ విద్యార్థుల చేయూత



ప్రిన్సిపాల్‌కు మైక్‌సెట్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుపతి(విద్య), జనవరి 8: తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థులు మైక్‌సెట్‌ను వితరణగా అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు ఇచ్చారు. 1976-78 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కళాశాల వేదికగా ఐదవ పునః సమ్మేళనాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు. రూ.కళాశాలకు అవసరమైన రూ.50 వేల విలువజేసే మైక్‌సెట్ అందజేశారు. గ్రూప్‌ల వారీగా అత్యుత్తమ మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు రూ.50 వేలు నగదు బహుమతు లుగా అందజేశారు. విద్యార్థులకు ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబును సన్మానించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎల్ఆర్ మోహన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎన్.శ్రీనాథ్, డాక్టర్ జి.చంద్రశేఖర్, కెప్టెన్ చిత్తా శ్రీనివాస్, డాక్టర్ వెంకటరమణమూర్తి, బాలాజీ ప్రసాద్, అధ్యాపకులు ప్రియవర్ధన్‌బాబు, డాక్టర్ సీఎల్ చెన్నారెడ్డి, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ అధికారిణి ఇంట్లో ఈడీ సోదాలు అవాస్తవం: టీటీడీ

తిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో టీటీడీ ప్రజా సంబంధాల అధికారిణిగా పనిచేసిన నిష్కాబేగం ఇంట్లో ఈడీ దాడులు చేసిందని, నగలను స్వాధీనం చేసుకుందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వాస్తవ దూరమని టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ పేరు కలిగిన వారు టీటీడీ ప్రజా సంబంధాల అధికారిగా ఎప్పుడూ లేరని, గతంలో ఎక్కడో జరిగిన ఫొటోలను జతపరిచి టీటీడీ పేరును వాడటాన్ని ఖండిస్తున్నామని పేర్కొంది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అవాస్తవ వార్తలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని టీటీడీ హెచ్చరించింది.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మకు సన్మానం



కుమారమ్మను సన్మానిస్తున్న నేతలు

తిరుపతి (జీవకోన), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మను టీడీపీ ఎస్సీ సెల్ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి మురళీధర్, నగర అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. శ్రీనివాసపురంలో జరిగిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ కష్టపడిన వారికి టీడీపీలో ప్రాధాన్యత ఉంటుందని, అందుకు తానే నిదర్శనమని అన్నారు. ఎస్సీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతిబాబు, నాయకులు తాళ్లపాక దాము, సుబ్బయ్య, పెంచలయ్య, ముని, నీలిమ, కృష్ణయ్య, జయప్రకాష్, మధు, సుబ్రహ్మణ్యం, మునిబాలాజీ, ఎస్సీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రేపు దక్షిణ మధ్య రైల్వే పీసీఎస్‌వో రాక

తిరుపతి(సెంట్రల్) జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం తిరుపతికి రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. గురువారం కాచిగూడలో బయలుదేరి, శుక్రవారం రేణిగుంటకు చేరుకుంటారని పేర్కొన్నాయి. రేణిగుంట, తిరుపతి రైల్వేస్టేషన్లలో భద్రతపై తనిఖీలు నిర్వహించి, 12న రేణిగుంట నుంచి తిరుగు ప్రయాణమవుతారని తెలిపాయి.

ప్రయాణికుల భద్రతే కీలకం

తిరుపతి(సెంట్రల్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆపరేటింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రయాణికుల రక్షణ, రైళ్ల భద్రతే లక్ష్యంగా పని చేయాలని తిరుపతి స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నప్ప రెడ్డి తెలిపారు. బుధవారం స్టేషన్‌లోని వీఐపీ చాంబర్‌లో స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్స్‌తో ఆయన సమావేశమయ్యారు. స్టేషన్ యార్డులలో రైళ్ల రాకపోకల నిర్వహణ సమయంలో నియమ నిబంధనలు పాటించాలన్నారు. రైళ్ల భద్రతకు సంబంధించిన అంశాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య బాలికల పాఠశాలలో భేటీ సమ్మాన్



విద్యార్థినుల మానవహారం

తిరుపతి(విద్య), జనవరి 8: ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీచైతన్య బాలికల పాఠశాలలో బుధవారం భేటీ సమ్మాన్ స్మార్ట్ లివింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్ఐ జి.రోషిణి, హెడ్ కానిస్టేబుల్ పి.సుశీల ముఖ్య అతిథులుగా హాజరై నేటి సమాజ పరిస్థితుల్లో బాలికలకు విద్య అవసరాన్ని, సమాజ అభివృద్ధిలో స్త్రీపాత్ర గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి లక్ష్మీపురం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మానవహారం చేపట్టారు. కార్యక్రమాల్లో పాఠశాలల ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ వందనారెడ్డి, అకడమిక్ డీన్ మునయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై డీపీటీవో అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీటీవో జగదీష్

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై జిల్లా ప్రజారవాణాధికారి జగదీష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో కాంప్లెక్స్ ఆఫీసర్స్‌తో సమావేశమయ్యారు. విజయవాడ, బెంగళూరు నుంచి తిరుపతికి నడుస్తున్న ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ అద్భుతంగా ఉందన్నారు. శుభ్రత, నాణ్యత, సమయపాలన పాటిస్తున్నారని, సిబ్బంది వ్యవహారశైలి చాలా బాగుందని అన్నారు. తిరుపతి కేంద్రంగా తిరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయని, శుభ్రత లేదని, పగిలిన అద్దాలతో తిరుగుతున్నాయని అన్నారు. సమయపాలన కనిపించడం లేదన్నారు. తీరు మార్చుకోకపోతే పై అధికారులకు నివేదిక పంపాల్సి వస్తుందని తెలిపారు. వైకుంఠ ఏకాదశికి ఎలాంటి పొరపాట్లకూ తావులేకుండా బస్సులు నడపాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం, ఏటీఎం రామచంద్రనాయుడు, డీఎంలు హరిబాబు, భాస్కర్, బ్రహ్మం, భానుప్రకాష్ పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి 50 వేల అమెరికన్ డాలర్ల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం 50 వేల అమెరికన్ డాలర్లు విరాళంగా అందాయి. అమెరికాలోని చికాగోకు చెందిన ఎన్ఆర్ఐ భక్తుడు పెరంబదూర్ కందల శ్రీనివాసాచార్య ఈ విరాళాన్ని అందజేశారు. డాలర్లను బుధవారం రాత్రి టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు.

రుయాలో నాణ్యమైన వైద్యం అందించాలి

● ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్య

తిరుపతి(వైద్యం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్, రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కమిటీ సమావేశం ఎస్వీ మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది, ఇంజనీర్లు, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో రోగులకు మేలైన సేవలు అందించాలన్నారు. మెరుగైన సౌకర్యాల ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, సొసైటీ కన్వీనర్ రవిప్రభు గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటికి సంబంధించి తీసుకున్న చర్యల గురించి కమిటీకి వివరించారు. అనంతరం అనేక అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. డైట్ క్యాంటీన్ వద్ద పైప్‌లైన్ మరమ్మతుకు రూ.2.50 లక్షలు కేటాయించేందుకు ఆమోదించారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవనం, ఇతర మరమ్మతుల కోసం రూ.7.50 లక్షలు కేటాయించేందుకు తీర్మానించారు. టీబీసీ, డీఎస్టీ ల్యాబొరేటరీ మరమ్మతుల కోసం రూ.9.50 లక్షలు కేటాయించారు. కంప్యూటర్స్, యూపీఎస్‌లు, పీడియాట్రిక్ ఆపరేషన్ థియేటర్‌లో అనస్థీషియా వర్క్ స్టేషన్ కొనుగోలుకు రూ.1.35 లక్షల కేటాయించారు. ఐసీయూలో మంచాల కొనుగోలుకు ఆమోదించారు. హెచ్‌డీఎస్ కమిటీలో ఇద్దరు సభ్యుల నియామకం కోసం ఆమోదం తెలిపారు. సమావేశంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, ఎస్.వి.మెడికల్ కళాశాల పిన్సిపాల్ పి.ఎ.చంద్రశేఖరన్, ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శివరామిరెడ్డి, తిరుపతి జిల్లా ఆరోగ్య వైద్యాధికారి వి.బాలకృష్ణ నాయక్, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ జి రవిప్రభు పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు

మెట్లపైనే ఖాళీ మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు



మెట్లపై పడేసిన ఖాళీ మద్యం సీసాలు

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసం వసతి సముదాయానికి ఎదురుగా మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన 11/1, 11/2 వార్డు సచివాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పొద్దుపోగానే మందుబాబులు, ఆకతాయిలు, బిచ్చగాళ్లు సచివాలయాల మెట్లపై కూర్చుని మద్యం తాగి ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులను అక్కడే వదిలేసి వెళుతున్నారు. పొగాకు ఉత్పత్తులను నమిలి మెట్లపైనే ఉమ్మేస్తున్నారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలు ఈ పరిస్థితి చూసి విస్తుపోతున్నారు. మెట్లపై పడి ఉన్న చెత్తాచెదారంతో ఇబ్బంది పడుతున్నారు. పోలీసు అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



జోరుగా క్రీడాభివృద్ధి పనులు



శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న మల్టీస్పోర్ట్స్ కోర్ట్

తిరుపతి(క్రీడలు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. స్మార్ట్‌సిటీ నిధులలో రూ.12.23కోట్లతో ఇందిరా మైదానంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, శ్రీనివాస క్రీడా సముదాయంలో మల్టీస్పోర్ట్స్ కోర్ట్, స్విమ్మింగ్‌పూల్, వంటశాల, మరుగుదొడ్లు నిర్మించతలపెట్టారు. ఇందులో స్విమ్మింగ్‌పూల్ పనులు పూర్తిచేసుకొని 2019లో ప్రారంభించారు. కరోనా కారణంగా పనులు ఆగిపోయాయి. కరోనా అనంతరం పనులు మొదలుపెట్టి 2023లో కిచెన్, మరుగుదొడ్లు అందుబాటులోకి తెచ్చారు. మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ జోలికి వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరా మైదానంలోని మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్రీడా సముదాయంలో మల్టీస్పోర్ట్స్ కోర్ట్ పనులు జోరందుకొన్నాయి. ఈ క్రమంలో గత నెలలో ఇందిరామైదానంలోని మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభించారు. ఇటీవల శాప్ చైర్మన్ రవినాయుడు శ్రీనివాస క్రీడా సముదాయంలో తనిఖీలు చేపట్టారు. మల్టీస్పోర్ట్స్ కోర్ట్ అసంపూర్తిగా ఉండడాన్ని గమనించి వెంటనే పనులు పునఃప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. ఆ మేరకు వారం రోజులుగా జోరుగా సాగుతున్నాయి. బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడలకు అనుకూలంగా సింథటిక్ ఫ్లోరింగ్, ఇతర ఏర్పాట్లు, చుట్టూ వాకింగ్‌ట్రాక్, గ్యాలరీస్ నిర్మిస్తున్నారు. వచ్చేనెలలో ప్రారంభించడానికి చురుగ్గా పనులు సాగుతున్నాయి.

హోరాహోరీగా అంతర కళాశాలల క్రీడా పోటీలు

సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అదరహో..!



వివిధ క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీవర్సిటీ వేదికగా జరుగుతున్న 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్యపోటీలు మూడోరోజు బుధవారం హోరాహోరీగా సాగాయి. కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో పలు కళాశాలలకుచెందిన విద్యార్థులు హైజంప్, ట్రిపుల్‌జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, టేబుల్‌టెన్నిస్, రన్నింగ్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి క్రీడల్లో తలపడ్డారు. వెటర్నరీ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన సాహిత్య పోటీలలో పలువురు విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అదరహో అనిపించాయి. హైజంప్ పురుషుల విభాగంలో జి.మహేశ్వర రెడ్డి, ఏపీ చంద్రసాయి(ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, గన్నవరం), వి.నరేంద్రబాబు(వెటర్నరీ కళాశాల, తిరుపతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, మహిళల విభాగంలో ఎం.నిఖిత(వెటర్నరీ కళాశాల, ప్రొద్దుటూరు), ఎన్.ప్రణీత, వి.సాయి పూజిత(వెటర్నరీ కళాశాల, గరివిడి) తొలిమూడుస్థానాలు, టేబుల్‌టెన్నిస్ మహిళల విభాగంలో ఉద్యాతి మల్హోత్ర, డి.హారికప్రియ, ఎం.పార్థీవక్రిష్ణ(వెటర్నరీ కళాశాల, తిరుపతి) విన్నర్స్‌గా నిలవగా.. ఆర్.హర్షిణి, ఎన్.విద్య, ఇ.కావ్య రన్నర్స్‌గా నిలిచారు. మహిళల వాలీబాల్‌లో ఎం.సాయితేజస్విని, కె.భావన, డి.స్రవంతి, కె.ఆదివైష్ణవి, ఎస్.దివ్యశ్రీ, సి.అర్చన విన్నర్స్ సీహెచ్ శ్రీజ, ఆర్.ఇందుశ్రీ, ఆర్.మీనాక్షి, సీహెచ్ తిరుమల, బి.నిహారిక, ఎం.సమీర రన్నర్స్‌గా నిలిచారు. 100మీటర్ల పురుషుల రన్నింగ్‌లో ఆర్.జకేష్(డెయిరీ టెక్నాలజీ, తిరుపతి), ఎస్.శివాజి నాయక్, ఎ.వేణుతేజ (వెటర్నరీ కళాశాల, తిరుపతి) వరుసగా తొలి మూడుస్థానాలు, మహిళల విభాగంలో ఎం.సాయితేజస్విని (వెటర్నరీ కళాశాల, ప్రొద్దుటూరు), వి.సాయిపూజిత(వెటర్నరీ కళాశాల,గరివిడి), ఆర్.భాగ్య (వెటర్నరీ కళాశాల, తిరుపతి) వరుసగా తొలి మూడుస్థానాలు, 400 మీటర్ల పురుషుల రన్నింగ్‌లో ఎ.నవీన్‌కృష్ణ(వెటర్నరీ కళాశాల, గరివిడి) ప్రథమస్థానం, మహిళల విభాగంలో ఎం.సాయితేజస్విని(వెటర్నరీ కళాశాల, ప్రొద్దుటూరు) ప్రథమస్థానం, డిస్కత్రో మహిళల విభాగంలో సీహెచ్ పూజిత(డెయిరీ టెక్నాలజీ, తిరుపతి), ఎం.రమ్యకృష్ణ, కె.వందిత(వెటర్నరీ కళాశాల, గన్నవరం) వరుసగా తొలి మూడుస్థానాలు, పురుషుల చెస్‌లో శుభం సౌరవ్(వెటర్నరీ కళాశాల, తిరుపతి) విన్నర్, మహిళల విభాగంలో సీవీ ధరణీలక్ష్మి(వెటర్నరీ కళాశాల, తిరుపతి) విజేతగా నిలిచారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య, ఓఎస్‌ఏ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ జయచంద్రలు క్రీడా, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● సాంస్కృతిక నృత్యప్రదర్శనలు అదరహో: సాహిత్య పోటీల్లో భాగంగా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అదరహో అనిపించాయి. పలు నృత్య ప్రదర్శనలు యువతను ఉర్రూతలూగించాయి. విద్యార్థులు ఉత్సాహంతో సందడి చేశారు.

ముగిసిన దివ్యాంగ పెన్షనర్ల తనిఖీలు



దివ్యాంగుడి ఆరోగ్య పరిస్థితి తెలుకుంటున్న అధికారులు

తిరుపతి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పూర్తిగా మంచానికే పరిమితమై రూ.15వేలు పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగ పెన్షనర్లకు సంబంధించి బుధవారం సాయంత్రం మంగళం పంచాయతీలో అధికారులు తనిఖీలు చేశారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకుని వారి ఆరోగ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని ఫొటోలు తీసుకుని అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపి, అర్హుల జాబితాను విడుదల చేయనున్నారు. డాక్టర్ పి.రవిబాబు, డాక్టర్ సునీల్‌బాబు, డాక్టర్ వెంకటేశులు, దుర్గేశ్వర్, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొల్లపల్లెలో రీసర్వే అవగాహనా ర్యాలీ

తిరుపతి రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లెలో బుధవారం రీసర్వే ప్రాజెక్ట్‌పై గ్రామస్తులతో రూరల్ మండల రెవెన్యూ అధికారులు కలసి ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ చెంగారెడ్డి, ఆర్ఎస్‌డీటీ మోహన్, మండల సర్వేయర్ హేమకుమార్, వీఆర్వో మురళి, గ్రామసర్వేయర్ భరణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

రూరల్‌లో 1188 ఫిర్యాదులు

తిరుపతి రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని 29 రెవెన్యూ గ్రామాల్లో గతనెల 6 నుంచి నిర్ణీత తేదీల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు సదస్సుని వేమూరు గ్రామంలో నిర్వహించారు. మొత్తంగా ఈ సదస్సులకు ప్రజల నుంచి 1188 ఫిర్యాదులు అందగా.. 4992మంది హాజరయ్యారని తహసీల్దార్ రామాంజులునాయక్ తెలిపారు. అత్యధికంగా ఇళ్లస్థలాల కోసం 397 అర్జీలు, నిషేధిత భూములకు(22ఏ) సంబంధించి 344 ఫిర్యాదులు అందాయని వివరించారు. ల్యాండ్ గ్రాబింగ్ 33, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రక్షణకు సంబంధించి 9, ఆక్రమణలు 2, భూములకు హద్దులు చూపించాలని 21, ఎఫ్‌లైన్ ఫిర్యాదులు 111, జనరల్ సర్వే 8, ఇళ్లస్థలాల ల్యాండ్ అక్విజిషన్, జనరల్ ఎల్‌ఏ 6, దారి సమస్యలు 4, పట్టా సబ్‌డివిజన్ 9, ఆర్‌వోఆర్(హక్కులు)243, రెవెన్యూ అండ్ అదర్ కోర్టుకి సంబంధించి ఒక ఫిర్యాదు చొప్పున మొత్తంగా 1188 అందాయని వివరించారు.

బాలహిత గ్రామ పంచాయతీలు నిర్మించుకుందాం

తిరుపతి రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కిశోర బాలలు సామాజిక రుగ్మతలనుంచి బయటపడేవిధంగా అన్నిశాఖలు కలసికట్టుగా పనిచేసి.. బాలహిత గ్రామ పంచాయతీలను నిర్మించుకుందామని రూరల్ ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసంపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కిశోర బాలలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. సీడీపీవో ప్రదీప మాట్లాడుతూ బాల సమూహాలను ఏర్పరచి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఎంపీపీ వేముల యశోద, ఏసీడీపీవో జ్యోతి, ఎంఈవో శంకరయ్య, ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ సుకన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ వాటాదారుల్లో డివిడెండ్ కలకలం

తిరుపతి(ఆటోనగర్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ వాటాదారుల్లో డివిడెండ్ కలకలం రేగింది. టౌన్‌బ్యాంక్ వాటాదారులకు డివిడెండ్ చెల్లించాలని పాలకమండలి నిర్ణయించింది. ఇందుకు మహాజన సమావేశం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే మహాజన సమావేశానికి ఆరువేల మందికి పైచిలుకు వాటాదారులు హాజరుకావాలి. ఇప్పటివరకు జరిగిన మహాజన సమావేశాలకు రెండు, మూడు వందల మందికి మించి హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో అధికారులు నగర పరిధిలోని వాటాదారులను కలసి డివిడెండ్ వివరాలు తెలిపి సంతకాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. అంతవరకు బాగానే ఉన్నా సిబ్బంది రాత్రి సమయాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి సంతకాలు చేయాలని కోరడంతో వాటాదారులు భయాందోళనకు గురవుతున్నారు. తాము బ్యాంక్ వద్దకు వచ్చి సంతకాలు చేస్తామని చెప్పినా వినడంలేదని కొందరు తెలిపారు. ఒక వాటాదారుని వద్ద సంతకం సేకరిస్తే 20 రూపాయలు బ్యాంక్ చెల్లిస్తుందని చెప్పినట్లు సమాచారం. అందుకే సిబ్బంది పోటీపడి సంతకాలు సేకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ రెడ్డిని వివరణ కోరగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డివిడెండ్ ఇవ్వాలన్న ఉద్దేశంతోనే సంతకాలు సేకరించాలని చెప్పామని, అయితే రాత్రిపూట వెళ్లడం సరికాదని, ఒక సంతకం సేకరిస్తే 20 రూపాయలు ఇస్తామన్న విషయం తన దృష్టికి రాలేదని అన్నారు.

రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో.. తిరుపతి విద్యార్థులకు తృతీయ బహుమతి



లోకేష్ చేతుల మీదుగా చెక్ అందుకుంటున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), జనవరి 8: రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థుల ప్రాజెక్ట్ తృతీయ బహుమతి గెలుచుకుంది. ఈనెల 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్ విజయవాడలో జరిగింది. ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన బయో మెడికల్ ఇంజినీరంగ్ డిప్లొమా విద్యార్థులు బి.సుదర్శన్‌రావ్, ఎం.జయసూర్య ఇంటర్‌నెట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఓటీ) ఆధారిత హెల్త్ మానిటరింగ్ సిస్టం ప్రాజెక్ట్‌తో పోటీలో నిలిచారు. ఇది తృతీయ బహుమతి గెలుచుకుంది. మంగళవారం విజయవాడలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులు సుదర్శన్‌రావు, జయసూర్యలను అభినందించి, బహుమతులు అందజేశారు. బుధవారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు వారిని అభినందించారు. బయో మెడికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ ఆర్.ఉదయ్‌కుమార్, జనరల్ సెక్షన్ హెడ్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం

- భక్తులు ఆందోళన పడవద్దని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి పిలుపు
- కొత్త వైరస్ ప్రచారం నేపథ్యంలో మాస్కులతో రావాలని సూచన



'తిరుమల ఆలయంలో పదిరోజుల పాటు వైకుంఠద్వారాలు తెరిచే ఉంటాయి. కంగారు పడాల్సిన అవసరం లేదు. ప్రశాతంగా టోకెన్లు పొందండి. వైకుంఠద్వార దర్శనాలు చేసుకోండి' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బుధవారం ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో మీడియాకు వివరించారు. 3 వేల మంది పోలీసులు, 1,500 వందల మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రత కల్పిస్తామన్నారు. ఇక, వైకుంఠద్వార దర్శన రోజుల్లో టోకెన్లు లేని భక్తులకు దర్శనాలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు. కాగా కొత్త వైరస్ వస్తోందనే ప్రచారం జరుగుతున్న క్రమంలో భక్తులు మాస్కులు ధరించి అన్ని జాగ్రత్తలతో తిరుమలకు రావాలని టీటీడీ చైర్మన్ కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీధర్‌బాబు





బెల్లంకొండ సురేష్ - గౌతమ్ సింఘానియా

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, సినీనిర్మాత బెల్లంకొండ సురేష్, రేమాండ్ సంస్థ అధినేత గౌతమ్ సింఘానియా, మాజీ ఎంపీ చింతా మోహన్ ఉన్నారు.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,566

తలనీలాలు సమర్పించినవారు: 16,021



సంక్రాంతికి కూ..చుక్..చుక్

- తిరుపతి- హైదరాబాదుల మధ్య ప్రత్యేక రైళ్ళు



తిరుపతి(సెంట్రల్), జనవరి8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే తిరుపతి- హైదరాబాదు మధ్య సంక్రాంతి ప్రత్యేక రైళ్ళను నడుపనున్నట్లు ఆ రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. హైదరాబాదు కేంద్రంగా పలుప్రాంతాలకు ప్రత్యేక రైళ్ళు నడుపుతున్నామని తెలిపారు.

- చర్లపల్లినుంచి తిరుపతికి ప్రత్యేక రైలు (02764) బుధవారం సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాదు, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మరుసటి రోజు ఉదయం 7.15 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.
- తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(02763) గురువారం సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటిరోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లికి చేరుకొంటుంది.
- ప్రత్యేక రైలు ఈ నెల 11,15 తేదీల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి, 9,12,16 తేదీల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి రాకపోకలు నిర్వహిస్తాయి.
- కాచిగూడలో మరో ప్రత్యేక రైలు(07655) ఈ నెల 9వ తేది సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి మల్కాజ్‌గిరి, చర్లపల్లి జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబుబ బాదు, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటల మీదుగా మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.
- ఈ ప్రత్యేక రైలు 10వ తేది రాత్రి 8.05 గంటలకు బయలు దేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు కాచిగూడకు చేరుకొంటుది.
- ప్రత్యేక రైలు ఈ నెల 16న కాచిగూడ నుంచి తిరుపతికి, 10, 17 తేదీల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి రాకపోకలు నిర్వహిస్తాయి.

యూనివర్సిటీ వీసీల నియామకానికి

సెర్చ్ కమిటీల ఏర్పాటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీ వీసీల నియామక సెర్చ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. ఎస్వీయూ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా రాయ్‌పూర్ ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ రాంకుమార్ కాకాని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మాజీ వీసీ వీఎస్ రావు, యూజీసీ నామినీగా అహ్మదాబాదులోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అమి యు. ఉపాధ్యాయను నియమించారు. పద్మావతి వర్సిటీ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ నిరుపమ రాణి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా హైదరాబాదు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, యూజీసీ నామినీగా మధ్యప్రదేశ్‌కు చెందిన హరిసింగ్ గౌర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నీలిమ గుప్తాను నియమించారు. ● ద్రవిడ వర్సిటీ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా గౌహతికి నైపర్ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ యుఎస్ఎన్ మూర్తి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.నరసింహారావు, యూజీసీ నామినీగా ఢిల్లీకి చెందిన లివర్ అండ్ బిలియరీ సైన్స్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌కె సరిన్‌ను నియమించారు. ఆయా వర్సిటీల వీసీల నియామకానికి ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తులూ స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి ముగ్గురి పేర్లను ఈ సెర్చ్ కమిటీలు గవర్నర్‌కు సిఫారసు చేయనున్నాయి.

ప్రధాని నోట.. శ్రీసిటీ ప్రగతి మాట

శ్రీసిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రధాని మోదీ ప్రశంసించారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... శ్రీసిటీ పారిశ్రామిక నగరం వల్ల ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రస్తావించారు. పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడం తమ లక్ష్యం అన్నారు. ఇప్పటికే శ్రీసిటీ రూపంలో ఏపీ తయారీ రంగం ఊపందుకుందని వివరించారు. కేంద్ర పీఎల్ఐ, ఇతర పథకాలు వినియోగించుకుని మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు ప్రతిబింబంగా అంతర్జాతీయ కీర్తి గడించి, సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న శ్రీసిటీకి ప్రధాని కితాబు దక్కడం అభినందనీయం.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోండి

- నివేదికను కోర్టు ముందుంచండి
- తిరుపతి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలంటూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. పెళ్లకూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ నన్నం ప్రిస్కిల్లా మరొకరు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపులు, వాటికి మద్యం సరఫరా చేస్తున్న మద్యం షాపు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అనధికారికంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. పిటిషనర్లు ఇచ్చిన వినతులపై స్పందించలేదన్నారు.

పొగ మంచుతో పలు విమానాలు ఆలస్యం

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా తిరుపతి విమానాశ్రయంలో పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. బుధవారం ఉదయం హైదరాబాదు, ముంబై, ఢిల్లీ నుంచి నడుస్తున్న స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ అలయన్స్ విమానాలు దట్టమైన పొగమంచు కారణంగా 25 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి.

- 16 సవర్లు రికవరీ చేసిన పోలీసులు

ఒంటరి వృద్ధురాలిపై దాడిచేసి

బంగారు నగలు దోచుకెళ్లిన మహిళ అరెస్ట్



నిందితురాలు వల్లెమ్మ అరెస్టును చూపుతున్న పోలీసులు

నారాయణవనం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధురాలిపై దాడిచేసి బంగారు నగలు దోచుకెళ్లిన మహిళను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారాయణవనం నవసందులో ఓసూరమ్మ(89) అనే వృద్ధురాలు ఒంటరిగా కాపురం ఉంటున్నారు. అదే వీధిలో టిఫిన్ అంగడి నడుపుకుని జీవనం సాగిస్తున్న ఎం.వల్లెమ్మ వృద్ధురాలు ఓసూరమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలపై కన్నేసింది. ఈ నేపథ్యంలో వృద్ధురాలితో అప్పడప్పుడు మాటామంతీ కలిపి పరిచయం పెంచుకుంది. ఈ నెల 5వ తేది ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ఓసూరమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన వల్లెమ్మ వృద్ధురాలు దగ్గరికెళ్లి మాటలు కలిపి, దాడి చేసింది. దీంతో అపస్మారక స్థితిలో పడిపోయిన ఓసూరమ్మ శరీరంపై ఉన్న 16 సవర్ల చైన్, ముక్కు, కమ్మలను దొంగలించుకుని వెళ్లిపోయింది. వృద్ధురాలి చెల్లి కుమారుడు అయ్యప్పన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న వల్లెమ్మ గురించి వాకబు చేయగా, కైలాసకోనలో ఉన్నట్లు గుర్తించి ఆమెను విచారించారు. విచారణలో ఆమె వృద్ధురాలిపై దాడి చేసి, 16 సవర్ల బంగారు నగలు దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమెను అరెస్టు చేసి, బంగారు నగలను రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును రెండు రోజుల్లో ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు తదితర ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కడప-రేణిగుంట, తిరుపతి-మదనపల్లె, రేణిగుంట-నాయుడుపేట ఆరులేన్ల పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నడికుడి-శ్రీకాళహస్తి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణలో ఇబ్బందులు లేకుండా ఆర్డీవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి-పాకాల రైల్వేట్రాక్ డబుల్ లైన్‌కు సంబంధించిన భూసేకరణ పనుల్లో పురోగతి ఉండాలని ఆదేశాలిచ్చారు. జేసీ శుభం బన్సల్‌తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీటీడీకి 'పర్యావరణ హిత' సంస్థల ఝలక్

- మూడేళ్లుగా అద్దె చెల్లించకుండానే లడ్డూ కవర్ల విక్రయాలు
- ఇటీవల కౌంటర్లు స్వాధీనం చేసుకున్న టీటీడీ

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత కవర్ల విక్రయ సంస్థలు టీటీడీకి ఝలక్ ఇచ్చాయి. దాదాపు మూడేళ్ల పాటు టీటీడీకి ఎలాంటి అద్దెను చెల్లించకుండా లడ్డూ కవర్ల విక్రయాలు నిర్వహిస్తున్న క్రమంలో టీటీడీ ఇటీవల కౌంటర్లను మూసివేసి, స్వాధీనం చేసుకుంది. తిరుమలలో పర్యావరణ పరిరక్షణ కోసం టీటీడీ నాలుగేళ్ల కిందట ప్లాస్టిక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. తొలత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను నిషేధించిన టీటీడీ తర్వాత ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఉండకూడదనే నిబంధనను పెట్టింది. భక్తులు లడ్డూల కోసం వినియోగించే కవర్లను కూడా నిషేధించింది. ఇందులో భాగంగానే స్వీట్స్ తీసుకెళ్లేందుకు వినియోగించే పేపర్ బ్యాక్సులను, తర్వాత క్లాత్ బ్యాగులను, పేపర్ బ్యాగులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇవి లడ్డూలకు ఉండే నెయ్యిని పీల్చేస్తుండటం, ధర అధికంగా ఉండటంతో భక్తులు వీటిపై ఆసక్తి చూపలేదు. కొంతకాలం తర్వాత బయో డిగ్రేడబుల్ కవర్లు తెరపైకి వచ్చాయి. తొలుత 2021 ఫిబ్రవరిలో గ్రీన్ మంత్ర కవర్లు, అదే ఏడాది ఆగస్టులో డీఆర్డీవో సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కవర్లతో మరో సంస్థ ద్వారా బయో డిగ్రేడబుల్ కవర్ల విక్రయాలు మొదలయ్యాయి. అయితే వీరు కొన్నేళ్లుగా అద్దె చెల్లించని నేపథ్యంలో ఇటీవల టీటీడీ అధికారులు లడ్డూకౌంటర్‌లో వారి విక్రయాల కోసం కేటాయించిన కౌంటర్లను మూసివేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరి నుంచి ఎంత అద్దె రావాలి, వారిపై టీటీడీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియాల్సి ఉంది.



విరాళాన్ని అందజేస్తున్న దాత

అన్నప్రసాదంకు 50 వేల అమెరికన్ డాలర్ల విరాళం

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం 50 వేల అమెరికన్ డాలర్లు విరాళంగా అందాయి. అమెరికాలోని చికాగోకు చెందిన ఎన్ఆర్ఐ భక్తుడు పెరంబదూర్ కందల శ్రీనివాసాచార్య ఈవిరాళాన్ని అందజేశారు. డాలర్లను బుధవారం రాత్రి టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడికి దాత అందజేశారు.

రెవెన్యూ సదస్సులకు 149 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా 34 మండలాల పరిధిలో 24గ్రామ సభలు నిర్వహించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 149 అర్జీలు అందాయన్నారు. వీటిల్లో.. ఇంటి స్థలాలకు 8, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 11, రీసర్వేపై 9, ఆర్‌వోఆర్‌పై 81, ఇతర విషయాలకు భూసమస్యలపై 35 వచ్చాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజునుంచి ఇప్పటి వరకు 16,459 అర్జీలు అందాయన్నారు.

మున్సిపల్ కమిషనర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

విద్యార్థులే మన దేశ భవిష్యత్తు

- ప్రతిభా పురస్కారాల ప్రదాన సభలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతే మన దేశ భవిష్యత్తు అని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో బుధవారం ఏపీ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. కష్టాలకు ఎదురీది చదువుకున్నవారే ప్రపంచంలో అత్యద్భుత శక్తులుగా రూపొందారని గుర్తు చేశారు. పాఠ్య పుస్తకాలతోపాటు సమాజం గురించి చదువుకోవాలని సూచించారు. సాంకేతికతను సరిగా వినియోగించుకుంటూ.. పొగ, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం వంటి మహోన్నత మూర్తుల గొప్పదనాన్ని తెలుసుకోవాలని అన్నారు. ఎంత ఎదిగినా నైతిక మార్గాన్ని విడనాడకూడదని కోరారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ.. ఇంటర్ నుంచి పీజీ దాకా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ఇచ్చామన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు మదన్, టీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్వీయూ కామర్స్ హెడ్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తిరుపతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలన్నారు. సుమారు 250 మందికి అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్, వర్సిటీ అధ్యక్షుడు ఉపేంద్ర, నాయకులు శ్రీను, నగర అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న ప్రదానం చేస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

వైష్ణవి డెయిరీ మూత

వీధిన పడ్డ కార్మికులు ● పాడి రైతుల ఇక్కట్లు



పెళ్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఒడిదుడుగులు లేకుండా సాఫీగా సాగిపోతున్న వైష్ణవి డెయిరీ అకస్మాత్తుగా మూతపడింది. దీంతో అటు కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోయి వీధిన పడగా పాడి రైతులు సైతం తిప్పలు పడుతున్నారు. మండలంలోని పునబాక గ్రామంలో 21.5 ఎకరాల విస్తీర్ణంలో 2009 శ్రీవైష్ణవి డెయిరీకి శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని 2011లో ఉత్పత్తి ప్రారంభించారు. సుమారు 100 మందికి ఉపాధి లభించడంతో పాటు చుట్టుపక్కల 15 గ్రామాలతో పాటు ఇతర ప్రాతాల నుంచి పాల సేకరణ జరిగేది. ఇదిలా ఉండగా గత వైసీపీ ప్రభుత్వంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలకు సరఫరా చేసే నెయ్యిలో కల్తీ జరిగిందన్న వార్తలు కలకలం రేపాయి. వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి కల్తీ సరఫరా చేసినట్లు తెలియడంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. ఇందుకోసం నియమించిన సిట్ అధికారులు పలుధపాలు వైష్ణవి డెయిరీలో తనిఖీలు నిర్వహించారు. దీంతో ఆందోళనకు గురైన డెయిరీ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా గత నెల 15న పరిశ్రమను మూసివేసింది. ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా కంపెనీ మూసివేయడంతో తమకు రావాల్సిన గ్రాట్యుటీతో పాటు ఇతర అలెవెన్స్‌లు ఇవ్వాలని నెల్లూరు కార్మికశాఖ కమిషనర్‌ను కార్మికులు కలిసి విన్నవించారు.

దొంతు వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే నివాళి



వెంకటేశ్వర్లు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పులికొల్లు రాజేశ్వరరావు

వెంకటగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి దొంతు వెంటేశ్వర్లు(70)కు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాథ నాయుడు, వల్లభనేని మధు నాయుడు, సీసీ నాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధరం, నాయకులు సామల లక్ష్మీపతి, అవ్వారు సత్యనారాయణ, పోలంరెడ్డి కోటేశ్వర రెడ్డి, పప్పు చంద్రమౌళిరెడ్డి, రావి మస్తాన్ నాయుడు, రావి సత్యం నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, ఆరికట్ల శ్రీరాములు నాయుడు, చైతన్య, జనసేన నాయకులు జంపాల ప్రకాష్ తదితరులు వెంకటేశ్వర్లు మృతదేహనికి నివాళులర్పించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గెలుపొందిన జట్టుతో ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

గూడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఒత్తిడిని అధిగమించి చదువుల్లో ఏకాగ్రతను సాధిస్తారన్నారు. విజేతగా నిలిచిన స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రన్నర్‌గా నిలిచిన సూళ్లూరుపేటకు చెందిన ఎస్వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, అమ్మాజీ, రవీంద్రబాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

చిల్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద హామీలు నెరవేర్చాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రభాకర్, శశికుమార్, కాలేషా, జమాలుల్లా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 203 అర్జీలు

పెళ్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారం నాటితో ముగిశాయి. పెళ్లకూరు మండలంలోని డిసెంబరు 6నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం కాగా, బుధవారం కానూరులో నిర్వహించారు. మొత్తం 203 అర్జీలు అందగా, అందులో 64 వినతులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి, టీడీపీ మండల అధక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి సిస్టమ్ ఆయకట్టు కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు వెంపళ్ల వెంకటేశ్వర్లు, మాడుపూరు మురళీనాయుడు, నెలవల ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాల దగ్ధం

నాయుడుపేట టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురంలో ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. రాజగోపాలపురంలో నివాసం ఉంటున్న గురవయ్య కుటుంబ సభ్యులతో కలసి బుధవారం సాయంత్రం ఇంట్లో ఉండగా వాషింగ్ మిషన్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో కుటుంబసభ్యులు కేకలు వేస్తూ బయటకు పరుగులుతీశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేశారు. విద్యుత్‌శాఖ సిబ్బంది సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంటు

● నిర్వహణ లేక ఆగిన ఉత్పత్తి
● విద్యుత్ కనెన్షన్ కూడా ఇవ్వని వైనం
● హెచ్ఎంపీవీ వైరస్ నేపథ్యంలో ప్రజల ఆందోళన



ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

గూడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోగులకు ఆక్సిజన్ కొరత లేకుండా ఉండేందుకు స్థానిక ఏరియా ఆస్పత్రిలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంటు నిరుపయోగంగా ఉంది. కొవిడ్ సమయంలో ఆక్సిజన్ కొరత కారణంగా ఎంతో మంది ఇబ్బందులు పడడంతో పాటు ప్రాణాలను సైతం కోల్పోయారు. అప్పట్లో పలువురు దాతలు ముందుకు వచ్చి స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులు పడకుండా ఆక్సిజన్ సిలిండర్లను వితరణగా అందజేశారు. అయితే కొవిడ్ తీవ్రంగా ఉండడంతో ఆక్సిజన్ కొరత వల్ల రోగులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఆక్సిజన్ కొరతను నివారించేందుకు ఏరియా ఆస్పత్రిలో 2021 డిసెంబరు 31న ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంటును లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేశారు. అయితే రెండు నెలలు కూడా సక్రమంగా ప్లాంటును వినియోగించకపోవడంతో అది కాస్త నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆక్సిజన్ ప్లాంటు నేడు శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు తీవ్రమైన ఆయాశం, ఉబ్బసం వంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కొత్తగా హ్యూమన్ మెటాన్యూమో (హెచ్ఎంపీవీ) వైరస్ చైనా నుంచి మన దేశంలోని ప్రవేశించిందని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 5 కేసులు నమోదయ్యాయన్న వార్తలు ప్రజల్లో గుబులు రేపుతున్నాయి. ప్రధానంగా ఈ వైరస్ వల్ల శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయని వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ఆక్సిజన్ ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వాస్పత్రిలో జ్వర బాధితులు - ఒకే బెడ్‌పై నలుగురు చిన్నారులు

వణికిస్తున్న జ్వరాలు

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

సూళ్లూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో పడమటి పల్లెలు విషజ్వరాలతో మంచం పడుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు విజృంభిస్తుండంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. మండలంలోని దామానెల్లూరు, మంగళంపాడు, మంగానెల్లూరు, సుగ్గుపల్లి, ఉగ్గుముడి, ఎన్‌వీకండ్రిగ గ్రామాల్లో ఇంటింటా జ్వరపీడితులు ఉన్నారు. ఉన్నట్టుండి కాళ్లు, చేతులు పట్టేయడం, తీవ్ర జ్వరం రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గరు జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. జ్వరపీడితుల్లో చిన్నపిల్లలు అధికంగా ఉండటం గమనార్హం. దామానెల్లూరు, మంగానెల్లూరు గ్రామాల్లో ఊరంతా జ్వరాలతో బాధపడుతున్నారు. గత మూడు రోజుల నుంచి ఈ గ్రామాల్లో పిల్లలు కూడా తీవ్ర జలుబు, దగ్గు, జ్వరంతో ప్రభుత్వాస్పత్రికి వెళుతున్నారు. గత మూడు రోజులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. సోమవారం ఓపీ 310, మంగళవారం 360, బుధవారం 255 నమోదవగా ఇందులో 80 శాతానికి పైగా జ్వర బాధితులు ఉన్నారు. బుధవారం మంగానెల్లూరు, దామానెల్లూరు నుంచి దాదాపు 30 మందికి పైగా చిన్న పిల్లలు వైద్యం కోసం వచ్చారు. ఆస్పత్రిలో బెడ్‌లు సరిపోకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురికి వైద్యం చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

ఆర్‌ఆర్ ట్రేడర్స్ నిర్వాహకుడిపై కేసు

కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో ఉన్న ఆర్‌ఆర్ ట్రేడర్స్ అండ్ ఆర్డర్స్ సప్లయ్స్ యజమాని రాజారామాయన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. సగం ధరలకే ఫర్నిచర్ ఇస్తామని పలు ఆఫర్లు పెట్టి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఆర్‌ఆర్ ట్రేడర్స్ బోర్డు తిప్పేసిన సంగతి తెలిసిందే. ఆ సంస్థలో డబ్బులు పెట్టిన బాధితులంతా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌ఆర్ ట్రేడర్స్ యజమాని రాజారామాయన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతుడికి పోస్టుమార్టం

చిట్టమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టమూరు రొయ్యల కాలువ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో భరత్ కుమార్ గాంధీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాయుడుపేట మండలం బిరదవాడ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, వెంకటేష్, మహేష్‌ను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన

వెంకటగిరిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉదయం 10గంటలకు వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు కేవీకే శాస్త్రవేత్త విజయశ్రీ తెలిపారు. రైతులు పాల్గొని వ్యవసాయంలో డ్రోన్లు ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సూళ్లూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'నాకు ప్రాణపదమైన వస్తువులు, విషయాలు' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్రహ్మణ్యం శాస్త్రీ, జీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులకు బాటలు వేసుకోండి

కోట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో ఆయా పొదుపు సంఘాలు జీవనోపాధులకు బాటలు వేసుకోవాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ మురళి అన్నారు. మండల పరిధిలోని తిమ్మానాయుడుపాళెంలో బుధవారం 29 సంఘబంధాలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పొదుపు సంఘాల బలోపేతానికి విరివిగా రుణాలు ఇవ్వనుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ పొదుపు బాటలో నడవాలన్నారు. సమావేశంలో సీసీ ప్రసాద్, వీవోఏలు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సంక్రాంతి సంబరాలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, విభాగాధిపతులు ప్రొఫెసర్ ఇందుమతి, డాక్టర్ వల్లిదేవి, డాక్టర్ వాసవీ, డాక్టర్ శారద, రాఘవమ్మతో పాటు కోఆర్డినేటర్ రాజేష్, శ్రీనివాసులు, మేనేజర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

వెంకటగిరి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 11గంటలకు జరుగుతుందని ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనాథ్ బుధవారం తెలిపారు.

కార్యకర్తలకే పెద్దపీట

జడ్పీటీసీ, ఎంపీపీల సమావేశంలో జగన్

నెల్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'ఇప్పటివరకు జరిగింది మరచిపోండి, భవిష్యత్తులో అన్నీ విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్దపీట వేస్తా'... అని వైసీపీ అధినేత జగన్ జిల్లా ద్వితీయశ్రేణి నాయకులకు భరోసా ఇచ్చారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్లతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగింది మరిచిపోండి, ఇక భవిష్యత్తులో అన్నీ విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. మిమ్మల్ని ఇబ్బందులు పెట్టినవారి పేర్లు రాసిపెట్టుకోండి, మనం మళ్లీ అధికారంలోకి వచ్చాక వారి చేత మీకు సెల్యూట్ కొట్టిస్తాను.. అని జగన్ అన్నారు. రాజకీయ పదవుల్లో కానీ, అభి వృద్ధి పనుల విషయంలో కానీ కార్యకర్తలకే అగ్రతాంబూలమని తెలిపారు. సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ ఎమ్మెల్యేలు అనీల్ కుమార్ యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఉదయగిరి, వెంకటగిరి ఇన్‌చార్జులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఏటి పండుగ



ఏటి పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, కమిషనర్ ఫజులుల్లా తదితరులు

నాయుడుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా ఏటి పండుగ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం కమిషనర్ ఫజులుల్లాతో కలిసి ఎమ్మెల్యే ఏటి పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో ఏటి పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కుల మతాలకు అతీతంగా జరుపుకునే ఏటి పండుగను విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్, గంగాప్రసాద్, దార్ల రాజేంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న డిప్యూటీ ఈవో సనత్‌కుమార్

గూడూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలను చేపట్టి దేశాభివృద్ధిలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధూ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయలక్ష్మి

వెంకటగిరి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా అడుగులు ముందుకు వేయాలని మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళాశాలల్లో కిశోర బాలిక వికాశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, టీపీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి జయసింగ్, లక్ష్మీభవానీ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసంతో సమాజాభివృద్ధి

వాకాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల వికాసంతో సమాజాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ మహిళా పోలీసులు, హెల్త్ సెక్రటరీలకు కిశోర బాలికల వికాసంపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆత్మరక్షణ, డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్‌లపై పిల్లలకు అవగాహన కల్పించాలరు. కార్యక్రమంలో సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ బుజ్జమ్మ, ఎంఈవో నసీం అలీ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు సత్కారం



ఓజిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితిని వివరించారు. మాజీ సీఎంను శాలువాతో సత్కరించారు.

పుత్తూరు వార్తలు

కూటమి పాలనలో సీసీ రోడ్ల నిర్మాణాలు

● రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్/పుత్తూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో నగరి నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. బుధవారం పుత్తూరు మండలం కేబీఆర్ పురంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ నిధుల నుంచి రూ.5.20 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రజలకు చేరువ చేస్తున్నట్లు వెల్లడించారు. పుత్తూరు రూరల్ టీడీపీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, నాయకులు వెంకటరమణ, మునికృష్ణ పాల్గొన్నారు.

అప్పలాయగుంటలో వైకుంఠ ద్వారం ఏర్పాటు

వడమాలపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ శ్రీవాణి తెలిపారు. భక్తులకు ఎక్కువ సమయం ఉత్తర ద్వార దర్శనం కల్పించడం కోసం శుక్రవారం వేకువజామున 3.30 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. రాత్రి ఎనిమిది గంటల వరకు నిరంతరాయంగా సర్వదర్శనం కల్పిస్తున్నామని, 9 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

పుత్తూరు టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రబాబు బుధవారం ఏఎల్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఏపీ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు దేశయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

అవధుల్లేని అభిమానం.. ప్రయాణికుల పాలిట శాపం



బస్‌స్టాప్‌ను మూసేసిన ఫ్లెక్సీ

పుత్తూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అవధుల్లేని అభిమానం బస్సు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం కూడలిలో ట్రాఫిక్ పద్మవ్యూహంలా ఉంటుంది. తిరుపతి-చెన్నై దారులు, చిత్తూరుకు వెళ్లే దారితో మూడురోడ్ల కూడలి. మధ్యలో అంబేడ్కర్ విగ్రహం ఉంది. దీంతో చిత్తూరు నుంచి వచ్చి వెళ్లే పెద్ద వాహనాలు కూడలిలో మలుపు తిరిగేందుకు అష్టకష్టాలు పడతాయి. ఈ కూడలిలోనే ప్రయాణికుల వాహనాలు ఆగిపోతుంటాయి. దీంతో ప్రయాణికుల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఓ బస్‌షెల్టర్ నిర్మించారు. ఈ షెల్టర్‌ను మూసేస్తూ అధికార పార్టీ నాయకులు ఓ పెద్ద ఫ్లెక్సీ పెట్టారు. అధికారంలో వున్న వారికి శుభాకాంక్షలు, స్వాగతాల ఫ్లెక్సీలు పెట్టడం సర్వసాధారణం. అయితే వారం రోజులకు మించి ఉంటే నిబంధనల మేర మున్సిపాలిటీకి అద్దె చెల్లించాలి. ఈ చెల్లింపులు అధికార పార్టీ నాయకులకు ఎప్పుడూ మినహాయింపే. గతంలోనూ నేడు అదేపరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. చివరకు బస్సు ప్రయాణికులు రోడ్డు మీద ఎండలో నిలబడాల్సి వస్తోంది. ఈ విషయమై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

రెండో రోజూ కొనసాగిన వైద్య బృందం విచారణ



పెన్షన్‌దారుడిని విచారిస్తున్న వైద్యులు

పుత్తూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు అర్బన్ పరిధిలో మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితమై రూ. 15 వేలు పెన్షన్ పొందుతున్న 28మంది లబ్ధిదారులను వైద్య బృందం విచారణ చేపట్టింది. బుధవారం బృందం సభ్యులైన డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ రేణుకా దేవి, స్థానిక వైద్యులు డాక్టర్ కేఆర్ రమేష్, జి.పి.ఆశ రెండో రోజు కూడా విచారణ కొనసాగించారు. పెన్షన్‌దారుల ఇళ్లకు నేరుగా వెళ్లిన వైద్య బృందం లబ్ధిదారులను అన్ని కోణాల్లో పరిశీలించారు. విచారణ నివేదికను గోప్యంగా ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. చాలామందికి రూ.15వేల పెన్షన్‌లు రద్దయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పుత్తూరు టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పుత్తూరు రూరల్ మండలం, గొల్లపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజీ మాధవయ్య, ఇంటర్నేషనల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో ప్రజా సేవ చేయడం అభినందనీయమని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కోనేటి రవిరాజును అభినందించారు. రోగులకు ఉచితంగా వైద్య సేవలందించి, మందులు ఇచ్చారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, తిరుపతికి చెందిన వాసన్ ఐ కేర్, మధురి రెమిడి వైద్యశాల వైద్యులు ఆంజనేయులు, అభిషేక్, కళావతి, లోకేష్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 65 మంది పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

పుత్తూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 65 మంది గ్రీన్‌టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో ఎంపికైన విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఉత్తర్వులను అందించి అభినందనలు తెలిపారు. ఈ నెల 2వ తేదీన కళాశాలలో జరిగిన ఇంటర్వ్యూలో 88 మంది పాల్గొన్నారని వివరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1982-83 పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయులు గంగిరెడ్డి, తులసీరామ్, చంద్రశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు గంగిరెడ్డి మాట్లాడుతూ ఎప్పుడో తాము అందించిన విద్యను విద్యార్థులు మరచిపోకుండా తమను సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గత సంవత్సరం నవంబరులోపూర్వ విద్యార్థులు, ప్రజా కళావేదిక సంయుక్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.516, రూ.316, రూ.216 నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ ఇంతటి మంచి కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు, ప్రజా కళావేదిక సంయుక్తంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అరవ జయగోపాల్, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రగతి పరుగులు



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ బీసీ విభాగం నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం ప్రగతి వైపు పరుగులు తీస్తోందని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. పట్టణంలోని పూసలవీధి కూడలిలో బుధవారం టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాల్లో విధ్వంసానికి చిరునామాగా మారిన రాష్ట్రాన్ని వికాసం వైపు పరుగులు తీయిస్తున్న ఎన్డీయే కూటమి ప్రగతి ప్రదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల కృషితో రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు జరగని విధంగా సుమారు రూ.2లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా విశాఖ పట్టణంలో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వన్నియ కుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, టీడీపీ బీసీ విభాగం నాయకులు ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, మునిరాజాయాదవ్, షేక్ ఖాదర్‌బాషా, బీమాల భాస్కర్, మణి, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, శివ, రమేష్, మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, నూర్ మొహమ్మద్, సులేమాన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రంగోత్సవ్ పోటీల్లో మండల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్ కళాశాలలో బుధవారం నిర్వహించిన రంగోత్సవ్ పోటీల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదివే విద్యార్థినులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో 8 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. క్విజ్ విభాగంలో వరదయ్యపాళెం మండలంలోని సంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఝాన్సీ, నిఖిత జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్లోగన్స్ విభాగంలో జయశ్రీ ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. చిత్రలేఖనం విభాగంలో భార్గవి తృతీయ బహుమతి సాధించింది. వీరికి గైడ్ టీచర్‌గా అమృత, లత, దాక్షాయణి వ్యవహరించారు. వీరిని బుధవారం ప్రధానోపాధ్యాయులు మాధవయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు



విశ్వతమాలలో రోడ్లను శుభ్రం చేయిస్తున్న డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

ఏర్పేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం విశ్వతమాల గ్రామంలో వెలసిన సంతాన సంపద వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మర ఏర్పాట్లు జరిగాయి. భక్తుల సౌకర్యార్థం రోడ్లను శుభ్రం చేయించారు. దర్శనానికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, ప్రసాదాలు అందించడానికి సంబంధించిన కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్తలమండలి సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ ఉత్తర ద్వార దర్శన పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కేవీబీపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనాథుడి ఉత్తరద్వార దర్శన గోడపత్రికలను ఆలయ ధర్మకర్త కోలా ఆనంద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బుధవారం విడుదల చేశారు. 10వ తేదీ శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. దీంతో పాటు భక్తులకు అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు గవర్ల కృష్ణయ్య, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



వెదళ్లచెరువు ఎస్టీ కాలనీలో కూల్చివేసిన చర్చి

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదళ్లచెరువు ఎస్టీకాలనీలో సువార్త ప్రార్థన మందిరం కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్ మాట్లాడుతూ... ఈ కాలనీలోని 15 క్రైస్తవ కుటుంబాలకు, పాస్టర్‌కు అగ్రవర్ణానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ నివాస స్థలాలను కాజేయాలనే కుట్రతోనే ఇదంతా చేసినట్లు ఆరోపించారు. అనంతరం స్థానికంగా తమకిచ్చిన పట్టాలను కాలనీ వాసులు ప్రదర్శించి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి కాంజేరి సెల్వరాజ్, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం మండల కార్యదర్శి కె.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైస్కూలు ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

పిచ్చాటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పిచ్చాటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం జరుగుతుంది.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- డీఎల్‌పీవో ప్రభురెడ్డి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో ప్రభురెడ్డి

పిచ్చాటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యంపై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని డీఎల్‌పీవో ప్రభురెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ మీటింగ్ హాలులో పిచ్చాటూరు, నారాయణవనం, నాగలాపురం మండలాలకు చెందిన గ్రామ కార్యదర్శులకు స్వామిత్వపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ఆగిపోయినందున గ్రామాల మధ్య ఉన్న పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి పారిశుధ్యం పేరుకుపోయి దుర్వాసనతో కూడిన దోమల ఆవాస కేంద్రాలుగా మారుతాయని చెప్పారు. గ్రామ కార్యదర్శులు తక్షణమే సర్పంచ్‌లతో కలసి గ్రామాల్లో నిల్వ ఉన్న నీటిని బయటికి తోడివేయటానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీధుల్లో సిమెంటు రోడ్లపై పశువులు కట్టి వేయడం, నివాస గృహాల మధ్య పేడ దిబ్బలు వేసుకోవడాన్ని సహించవద్దని, తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్‌రఫీ, ఈవోపీఆర్‌డీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశితో విమానాశ్రయానికి వీఐపీల తాకిడి

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుపతి విమానాశ్రయానికి వీఐపీల తాకిడి అధికమైంది. తిరుమలలో పదిరోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రులతో పాటు వీఐపీల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు సవిత, సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, శాసన మండలి ఛైర్మన్ కొయ్యె మోషన్‌రాజు, 20 సూత్రాల ప్రోగ్రాం ఛైర్‌పర్సన్ లంకా దినకర్, తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్‌లు శ్రీవారి దర్శనానికి రానున్నట్లు సమాచార శాఖ అధికారులు తెలిపారు.

వగత్తూరు చెరువు గట్లను పటిష్ఠం చేస్తాం



వగత్తూరుచెరువును పరిశీలిస్తున్న అధికారులు

కేవీబీపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వగత్తూరు చెరువుకు మరమ్మతులు చేయిస్తామని ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్, డీఈఈ రత్నారెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని వగత్తూరు, కళత్తూరు చెరువులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ త్వరలోనే గట్లను పటిష్ఠం చేసి మరమ్మతులకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. చెరువు గట్టుకు ఉన్న తూములను కూడా మారుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ బాబు, సిబ్బంది ఉదయ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల వినతుల పరిష్కారానికి కృషి

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సర్వేయర్ల పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యానాదివెట్టులో పైలట్ విలేజ్ రీసర్వే



రీసర్వేలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

వరదయ్యపాళెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమాన్ని వరదయ్యపాళెం మండలంలోని యానాదివెట్టు గ్రామంలో బుధవారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ సుజాతమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిపై సూళ్ళూరుపేట డివిజన్ సర్వేయర్ ప్రసాద్‌రావు, మండల సర్వేయర్ వెంకటరమణయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. రీసర్వే ద్వారా భూవివాదాలకు తెర పడుతుందని, భూతగాదాలను రూపుమాపవచ్చని, నిక్కచ్చి కొలతలతో హద్దులు గుర్తించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రామచంద్రయ్యను బుధవారం కడపలోని ఆయన నివాసంలో ఏర్పేడు మండల టీడీపీ సీనియర్ నాయకుడు కిరణ్ పరామర్శించారు. రామచంద్రయ్య కుమారుడు ఇటీవల మరణించడంతో ఆయనను కలిసి సంతాపం తెలిపారు.

- ఏర్పేడు (ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లోపించిన పారిశుధ్యం

● కుప్పలు కుప్పలుగా వాడేసిన సూదులు, మందులు, ఇంజెక్షన్లు



మూసివున్న ల్యాబ్



చిన్నపాండూరు ఆరోగ్యకేంద్రం



తొలగించని మందు బాక్సులు, సూదులు, ఇంజెక్షన్లు

వరదయ్యపాళెం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికులు లేక శుభ్రత కొరవడింది. ఈ పీహెచ్‌సీకి పెద్దసంఖ్యలో రోగులు వచ్చి చికిత్సలు చేయించుకుంటుంటారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడి మందుల బాక్సులు అక్కడే... వాడిన సూదులు, మందులు, రోగులకు వేసే ఇంజెక్షన్లను అక్కడే కుప్పలుగా వేస్తున్నారు. దీంతో మరింత రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆరోగ్యకేంద్రం పరిధిలో సుమారు 13 ఉపకేంద్రాల ప్రజలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వైద్యపరీక్షల కోసం వస్తుంటారు. సిబ్బంది అంతంత మాత్రమే. సిబ్బందిని నియమించడానికి ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని.. లేదంటే అపరిశుభ్రత వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. కాగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసేవారు సమయ పాలన పాటించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 11 గంటలు అయినా సిబ్బంది రావడంలేదని రోగులు అంటున్నారు. జ్వరం వస్తే రక్తపరీక్షలు చేయడానికి ఈ పీహెచ్‌సీలోనే ల్యాబ్ ఉంది. ఇది మూసి ఉండటంతో రోగులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తోంది. వైద్యాధికారిణి అనిత ఎందుకు రావడంలేదని అడుగగా.. డిప్యూటేషన్‌పై వెళుతున్నారని.. కొత్తవారు వస్తే రిలీవ్ చేస్తామని.. అప్పటి వరకు రావాలని అధికారులు తెలిపినా రావడం లేదని ఆరోగ్య కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఇకనైనా పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సిబ్బంది సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే ఆదిమూలం



అరణ్యం కండ్రిగలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని అరణ్యం కండ్రిగ పంచాయతీ, అరణ్యంకండ్రిగలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. దీనిని నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాలమంగళంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు మినీ స్టేడియం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, ఆర్వో తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యేకు విన్నవించగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నారాయణవనం జడ్పీటీసీ సుమన్‌కుమార్, టీడీపీ నాయకులు ఏకాంబరం, గోవిందస్వామి, భాస్కరన్, రవి, కందస్వామి నాయుడు, ఆర్ముగం, మురళి, ఎంపీడీవో గుణశేఖర్, పంచాయతీరాజ్ డీఈ వెంకటరమణ, ఏఈ నరేష్, ఉపవిద్యాశాఖ అధికారి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



దాసుకుప్పంలో వినతులు సమర్పిస్తున్న గ్రామస్తులు

సత్యవేడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. గత నెల 7వ తేదీ నుంచి తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మండలంలోని 29 పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. బుధవారం మండలంలోని చెన్నేరి, దాసుకుప్పం గ్రామాల్లో జరిగిన చివరి రోజు రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. చెన్నేరి ప్రాథమిక పాఠశాల స్థలాన్ని సర్వేచేసి సరిహద్దులు గుర్తించాలని పాఠశాల హెచ్ఎం లీలావతి అధికారులకు వినతి అందించారు. సర్వేనెంబర్ 87లో గతంలో గిరిజనులకు ఇచ్చిన సాగు భూమి అన్యాక్రాంతమైందని, సర్వేచేసి అర్హులకు అందేలా చూడాలని గ్రామస్తుడు భాస్కర్ విన్నవించారు. పొలాలకు వెళ్ళడానికి దారి సౌకర్యం కల్పించాలని రైతులు కోరారు. సర్పంచ్ రవిరెడ్డి, వీఆర్వో శేఖర్, సెక్రటరీ లోకేశ్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, సచివాలయ సర్వేయర్ శేఖర్ టీడీపీ నాయకులు లోకయ్యరెడ్డి, మునిరాజ, శేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

● రేణిగుంట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రంరెడ్డిపాళెంలో తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఒక్క వినతిపత్రం కూడా అందలేదు. తహసీల్దారు మాట్లాడుతూ గత నెల ఆరో తేదీ నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 204 దరఖాస్తులు భూసమస్యలపై వచ్చాయని తెలిపారు. ఇప్పటికే 99 సమస్యలను పరిష్కరించామని, ఇంకా 105 సమస్యలు పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

● కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశం గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 35 అర్జీలు వచ్చాయని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి సుమారుగా 40రోజుల సమయం పడుతుందని, అప్పటి వరకు కార్యాలయాల చుట్టూ తిరగవద్దని రైతులకు సూచించారు. అవసరమైతే అర్జీల్లో ఉన్న ఫోన్ నెంబర్ల ద్వారా తెలియజేస్తామని అన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, నాయకులు అయ్యప్ప, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పంచాయతీ అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గత కొన్ని రోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయంలో ఆస్పత్రి వద్ద విధులు నిర్వహించాలంటే మహిళా సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రి అధికారుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆస్పత్రి ఆవరణలో పంచాయతీ సిబ్బంది వీధి దీపాలను ఏర్పాటు చేశారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయండి

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీలు కృషి చేయాలని ఎంఈవో మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని కనమనంబేడు ప్రాథమిక పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో జరిగే అభివృద్ధి, విద్యా కార్యక్రమాలలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్‌రెడ్డి సూచించారు. మండలంలోని టీబీపురం, కాటూరు గ్రామాలలో బుధవారం ఏవో భారతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏడీఏ పాల్గొని సాగు విధానాలపై రైతులకు పలు సూచనలు చేశారు.

నేడు సత్యవేడులో వడిత్యా శంకర్ నాయక్ పర్యటన

సత్యవేడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ గురువారం సత్యవేడు మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దాసుకుప్పం, సత్యవేడు, కొత్త మారికుప్పం, సత్యవేడు, రాజగోపాలపురం గ్రామాల్లోని గిరిజన కాలనీల్లో పర్యటించి, కాలనీ వాసులతో మాట్లాడనున్నారు. అనంతరం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోర వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శోభారాణి

నాగలాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోర వికాసం కార్యక్రమం దోహదపడుతుందని సీడీపీవో శోభారాణి పేర్కొన్నారు. బుధవారం నాగలాపురం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో సీడీపీవో శోభారాణి ఆధ్వర్యంలో కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ బాల బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. బాలికల అక్రమ రవాణా, రుతుక్రమ పరిశుభ్రత, మహిళా మిత్ర, సైబర్ మిత్ర వంటి మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ నాయక్, ఎంఈవో బాబయ్య, వెలుగు ఏపీఎం సీతారామయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, హెచ్ఎం కస్తూరయ్య, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

ఏర్పేడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.నారాయణ అన్నారు. ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్టు లెవల్ మల్టీస్టేక్ హోల్డర్ కన్సల్టెన్సీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు అన్ని శాఖల వారు సమిష్టిగా కృషి చేయాలన్నారు. 2024 జనవరి నుంచి నవంబరు వరకు ప్రగతి సంస్థ ప్రాజెక్టు ఏరియాలో 67 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. 149మంది బడి బయట పిల్లలను, 49 బాలకార్మికులను గుర్తించి బడిలో చేర్పించామన్నారు. సీడీపీవో కృష్ణమంజరి మాట్లాడుతూ కిశోర వికాసం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కేలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల కోఆర్డినేటర్లు శిరీష, సుభాష్ చంద్రయ్య, సిబ్బంది వెంకటేష్, మురగయ్య, సుమలత, అంగన్‌వాడీకార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం చేద్దాం

శ్రీకాళహస్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణదానం చేద్దామని యువతరం సేవాసమితి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతరం సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదాతలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.